ఆంధ్రజ్యోతి
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
శనివారం 14 సెప్టెంబరు 2024



రాష్ట్రస్థాయి పోటీలకు ఇందల్వాయి విద్యార్థిని

ఇందల్వాయి, సెప్టెంబరు 13: ఇందల్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని హారిక రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం లక్ష్మీనాథం తెలిపారు. ఈనెల 14, 15 తేదీలల్లో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి రమ్య గ్రౌండ్‌లో జరిగే 43వ రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలో హారిక పాల్గొననుందని అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన హారికను వ్యాయామ ఉపాధ్యాయుడు భూపతిరాజేశ్వర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి, తదితరులు

దక్షిణ భారత రోడ్ సైక్లింగ్ పోటీలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి జిల్లాలో రోడ్ సైక్లింగ్ పోటీలు
- ఐదు రాష్ట్రాల నుంచి రానున్న 300 మంది క్రీడాకారులు
- క్రీడలను ప్రారంభించనున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 13: జిల్లా కేంద్రంలో క్రీడా సందడి మొదలవుతుంది. జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల వేదిక ఇందూరు నగరం కానుంది. గతంలో జిల్లాలో సైక్లింగ్‌కు సంబంధించిన క్రీడా పోటీలు జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలోనే జరిగాయి. ప్రస్తుతం జాతీయ స్థాయిలో క్రీడా పోటీలు జరుగుతుండటంతో క్రీడా అభిమానులు దక్షిణ భారత రోడ్ సైక్లింగ్ పోటీల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే దక్షణ భారత రోడ్ సైక్లింగ్ పోటీల కోసం రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి, జిల్లా కార్యదర్శి భూలోకం విజయ్‌కాంత్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో ఈ పోటీలు జరుగనున్నాయి. వీటి కోసం నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. శనివారం ఉదయం 7గంటలకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ చేతుల మీదుగా ఈ పోటీలను ప్రారంభించనున్నారు. ఎంపీతో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఈ పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

ఐదు రాష్ట్రాల నుంచి క్రీడాకారుల హాజరు..

దక్షిణ భారత రోడ్‌సైక్లింగ్ పోటీలు నగరంలో రెండు రోజుల పాటు జరుగనున్నాయి. శనివారం, ఆదివారం ఈ పోటీలు జరగనున్నాయి. దక్షణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాల క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొననున్నారు. సుమారు 300 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలల్లో అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ఇప్పటికే అనేక పతకాలు సాధించిన ప్రముఖ క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొననున్నారని తెలిపారు. మహిళా ఎలైట్ విభాగంలో 19 సంవత్సరాలపైన, జూనియర్ బాలికల విభాగంలో 17-18 సంవత్సరాలలోపు, సబ్ జూనియర్ విభాగంలో 2008-2011 తర్వాత పుట్టిన వారు ఈ పోటీల్లో పాల్గొననున్నారు.



ఎమ్మెల్సీకి సన్నద్ధం

- దగ్గర పడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవీకాలం
- పోటీకి సన్నద్ధమవుతున్న ప్రధాన పార్టీల ఆశావహులు
- ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో గ్రాడ్యుయేట్‌ల వివరాలను సేకరిస్తున్న నేతలు
- మరో ఐదు నెలల్లో ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు నిర్వహించే అవకాశం

నిజామాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవీకాలం దగ్గర పడుతుండటంతో ప్రధాన పార్టీల నేతలు పోటీకి సన్నద్ధమవుతున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ వచ్చేనెల నుంచి ఓటరు జాబితా నమోదుకు అవకాశం ఇవ్వడంతో ముందస్తుగానే నేతలు సిద్ధమవుతున్నారు. తమకు దగ్గరగా ఉన్న నేతలు సంఘాల ద్వారా ఎక్కువ మొత్తంలో ఓటర్లను నమోదు చేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో సభలు, సమావేశాల్లో పాల్గొంటున్నారు. ప్రధాన పార్టీల నేతలతో పాటు విద్యా రంగంలో, వైద్య రంగంలో ఉన్న వారు కూడా ఈ దఫా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ మంది ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ముందస్తు ఏర్పాట్లను చేసుకుంటుండగా మిగతా జిల్లాలోని వారు కూడా ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో అధికారం లేనప్పుడే కాంగ్రెస్ అభ్యర్థి ఈ నియోజకవర్గం నుంచే గెలువగా ఈ దఫా సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ నిలబెట్టుకునేందుకు ఆ పార్టీ నేతలు కూడా పెద్ద ఎత్తున ప్రయత్నాలను మొదలు పెట్టారు. ఎమ్మెల్సీ పదవీకాలం మరో ఐదు నెలలు ఉండగానే ముందస్తు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

మార్చిలో పూర్తవనున్న పదవీ కాలం..

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవీకాలం వచ్చే మార్చి నెలతో పూర్తవుతుంది. ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీగా మాజీ మంత్రి, టి.జీవన్‌రెడ్డి కొనసాగుతున్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ పట్టభద్రుల నియామకం నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఆరు సంవత్సరాలు పూర్తవుతున్నందున మరో ఐదు నెలల్లో ఈ పట్టభద్రుల స్థానానికి ఎన్నిక జరగనుంది. వచ్చే ఫిబ్రవరి నెలలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల కోసం ముందస్తుగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటరు నమోదుకు అవకాశం ఇవ్వనుంది. అక్టోబర్ నెల నుంచి పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించను న్నారు. ఆ నెల నుంచి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు గడువు ఇస్తారు.

ఎమ్మెల్సీగా కొనసాగుతున్న టి. జీవన్‌రెడ్డి..

పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా టి.జీవన్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఆయన గత శాసనసభ ఎన్నికల్లో జగిత్యాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. పార్లమెంట్ ఎన్నికలో నిజామాబాద్ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న ఆయన పార్టీ నిర్ణయం బట్టి మళ్లీ పోటీ చేసే అవకాశం ఉంది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ముందు కరీంనగర్‌కు చెందిన నారదాసు లక్ష్మణ్‌రావు ఎమ్మెల్సీగా కొనసా గారు. అంతకుముందు సత్యనారాయణ ఎమ్మెల్సీగా ఉన్నారు. వీరిద్దరూ బీఆర్ఎస్ తరపున ఎంపిక య్యారు. ఈ దఫా మాత్రం ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎక్కువ మంది సిద్ధమవుతున్నారు.

కరీంనగర్ జిల్లా నుంచే ఆశావహులు అధికం..

కరీంనగర్ జిల్లా నుంచే ఎక్కువ మంది పోటీకి ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పోటీ పడకుంటే కరీంనగర్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన వెలిచాల రాజేందర్‌రావు పోటీ చేయనున్నారు. ఆయనతో పాటు ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి ఈ దఫా పోటీ కోసం సిద్ధమవుతున్నారు. ఆయన కళాశాలలు మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉండటం ఇరవై ఏళ్లగా విద్యార్థులతో పరిచయాలు ఉండటం తనకు కలిసి వస్తుందని భావిస్తున్నారు. బీఆర్ఎస్ తరపున కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పోటీకి సన్నద్ధమవుతున్నారు. తన మద్దతు దారులతో ఇప్పటికే ఓటరు జాబితాలో నమోదు చేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఆయనతో పాటు బీఎస్‌రావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎస్ రావు పోటీకి సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు.

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని మూడు ఎంపీ స్థానాలను కైవసం చేసుకు న్న బీజేపీ నేతలు కూడా ఈ దఫా ఎమ్మెల్సీ స్థానంపై నజర్ పెట్టి పోటీకి సన్నద్ధమవుతున్నారు. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ మూడు ఎంపీ స్థానాలు బీజేపీ ఖాతాలో ఉండటం వల్ల తమకు కలిసివస్తుందని భావిస్తున్నారు. ఆ పార్టీ తరపున పోటీ చేసేందుకు కరీంనగర్‌కు చెందిన పి.సుగుణాకర్‌రావుతో పాటు రాణి రుద్రమ పోటీ పడుతున్నారు. పట్టభద్రుల నియోజకవర్గం పెద్దది కావడం వల్ల ప్రైవేటు పాఠశాలల సంఘం నేత యాదగిరి శేఖర్‌రావు కూడా ఈ దఫా పోటీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన ఇప్పటికే ఈ నాలుగు జిల్లాల పరిధిలో ప్రైవేటు పాఠశాలల ఆధ్వర్యంలో సమావేశాలను నిర్వహిస్తున్నారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన ఆయన వివిధ ఉపాధ్యాయ సంఘాలు కూడా తనకు సహకరిస్తాయని భావిస్తున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటరు నమోదుకు షెడ్యూల్ ప్రకటించగానే నమోదు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ దఫా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక మాత్రం రసవత్తరంగా కొనసాగడంతో పాటు గట్టి పోటీ జరిగే అవకాశం కనిపిస్తోంది.

ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో..

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల పరిధిలో ఉంది. ఒకదఫా మెదక్ నుంచి ఎన్నిక కాగా రెండు దఫాలు కరీంనగర్ జిల్లాకు చెందిన వారే ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ దఫా మాత్రం ఉమ్మడి నాలుగు జిల్లాల నుంచి పోటీ చేసేందుకు నేతలు సన్నద్ధమవుతున్నారు. వీరితో పాటు వివిధ రంగాలకు చెందిన వారు పోటీ కోసం సిద్ధమవుతున్నారు.

చిరుత కలకలం!

- భయాందోళనలో నిజామాబాద్ రూరల్ ప్రజలు

మోపాల్, సెప్టెంబరు 13: నిజామాబాద్ రూరల్ ప్రాంతంలో చిరుత సంచారం కలకలం రేపడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత రెండు రోజుల క్రితం కులాస్‌పూర్, బాడ్సి అటవీ ప్రాంతంలో కనిపించగా గురువారం రాత్రి రూరల్ మండలంలోని గుండారం, మల్కాపూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కనిపించడంతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రెండు, మూడు రోజుల వ్యవధిలోనే రెండు గ్రామాల్లో చిరుత సంచారం కలకలం రేపడంతో ఈ ప్రాంత ప్రజలు రాత్రివేళల్లో బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. అటవీ ప్రాంతాలు దగ్గరగా ఉండటంతో ఎప్పుడు ఎక్కడి నుంచి ఏమి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో వాహనాలపై ప్రయాణం చేయడానికి అనేక గ్రామాల ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. గుండారం, మల్కాపూర్ గ్రామాల్లో పులి కనిపించినట్లుగా ప్రచారం జరగడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కాగా, ఈ విషయమై రూరల్ ఎఫ్ఆర్‌వో సంజీవ్‌గౌడ్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.



● జక్రాన్‌పల్లి పెద్దచెరువు

నిండుకుండలా చెరువులు

- జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు
- నిండిన చెరువులు, పారుతున్న అలుగులు
- బోరుబావుల్లో పెరిగిన భూగర్భ జలాలు
- రానున్న యాసంగి పంటల సాగుకు ఢోకా లేదంటున్న జిల్లాలోని రైతులు

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 13: జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. చెరువులు అలుగు పారుతూ జలకళను సంతరించుకున్నాయి. వర్షాకాలం ప్రారంభమైన జూన్‌లో అడపదడప వర్షాలు కురవడంతో వానాకాలం సాగుకు సన్నద్ధమైన రైతులు ఆందోళన చెందారు. దుక్కులు దున్ని విత్తనాలు వేసిన రైతులు వానల కోసం ఆశగా ఎదురు చూశారు. అయితే ఆగస్టు నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో ఎండుముఖం పట్టిన పంటలు చిగురించాయి. దీంతో రైతుల్లో ఆశలు మొదలయ్యాయి. ఎండుముఖం పట్టేదశలో వర్షాలు కురువడంతో రైతులు సాగు చేస్తున్న పంటలకు మేలు జరిగింది. గడిచిన ఆగస్టులో మండలంలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. కలిగోట్, చింతలూర్, కొలిప్యాక్ వాగులో చెక్‌డ్యాంలపై నుంచి వరద ఉధృతంగా పారుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ సెప్టెంబర్ మొదటి వారం వరకు సుమారు 89 సెంటీమీటర్ల వర్షపాతం కురిసినట్టు అధికారులు తెలిపారు. గడిచిన ఆగస్టు నెలలోనే మండలంలో 25సెంటీమీటర్ల వర్షం కురిసిందని అధికారులు వివరించారు. వర్షాలు కురువడంతో వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరిగాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ పంటలతో పాటు రానున్న యాసంగి పంటల సాగుకు ఢోకా లేదని రైతులు తెలిపారు. అన్ని గ్రామాల్లోని చెరువు ఆయకట్టుల కింద యా సంగి పంటలకు కూడా ఢోకా లేదని చెరువులలో నీరు ఉన్నందున చెరువు ఆయకట్టు కింట యాసంగి పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రైతులు పండించిన ధాన్యంతో పాటు మొక్కజొన్న పంటలకు మద్దతు ధర ప్రక టించి కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

యాసంగి పంటలకు సాగు నీటికి ఢోకా లేదు..

: జైడి గంగారెడ్డి, రైతు, (అర్గుల్)



ఈ ఏడాది పంటలు ఎండిపోతున్న దశలో జూలైలో జల్లుల వర్షం కురువగా పంటలకు కొద్దిగా మేలు జరిగింది. గడిచినా ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు చెరువులు నిండగా వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భజలాలు పెరిగాయి. ప్రస్తుతం ఖరీఫ్ పంటలతో పాటు రానున్న యాసంగి పంటల సాగుకు సాగునీరుకు ఢోకా లేదు. ప్రభుత్వం సమయానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. మొక్కజొన్న పంటను కూడా కొనుగోలు చేయాలి.



అర్గుల్ చెరువు అలుగు



కలిగోట్, చింతలూర్ చెక్‌డ్యాం..



నారాయణపేట్ పలకకుంట చెరువు అలుగు



ఆరుబయట వంట.. ఎన్నాళ్లీ తంటా!

- పాఠశాలల్లో అసంపూర్తిగా వంట షెడ్లు
- ఇబ్బంది పడుతున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు
- ఇంటి వద్దే వంట చేసి పాఠశాలలకు తీసుకువస్తున్నవైనం



● కోటగిరిలో ఆరు బయట వంట చేస్తున్న నిర్వాహకులు

కోటగిరి, సెప్టెంబరు 13: ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులు లేక మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు తంటాలు పడుతున్నారు. చెట్ల కింద వంట తయారు చేయడంతో చెత్త, దుమ్ము, ధూళి పడుతుండడంతో 12ఏళ్ల క్రితం ప్రభుత్వం వంట గదుల నిర్మాణాన్ని చేపట్టింది. ఒక గది నిర్మించి రేకుల షెడ్డు మాదిగా ఏర్పాటు చేశారు. ఒకే గదిలో స్టోర్ రూమ్, వంట పొయ్యి ఉండడంతో పొగ బయటకు రాగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం స్లాబ్‌తో రెండు గదులను చేపట్టింది. ఉపాధి హామీ పథకం కింద అనేక పాఠశాలల్లో వంట షెడ్ల నిర్మాణాలు చేపట్టగా చాలా చోట్ల అసంపూర్తిగా కనిపిస్తున్నాయి. కాగా, వృథాగా ఉన్న తరగతి గదులు, వరండాలతో పాటు ఆరు బయట వంట చేస్తున్నారు. కట్టెల పొయ్యిపై భోజనం వండే మహిళలు పొగతో ఇక్కట్లకు గురవుతున్నారు. షెడ్లులేని పాఠశాలల్లో ఏజెన్సీ నిర్వాహకులు మధ్యాహ్న భోజనాన్ని తమ ఇళ్లలో తయారు చేసుకుని తీసుకువస్తున్నారు.

ఉమ్మడి మండలంలో ఇదీ పరిస్థితి..

ఉమ్మడి కోటగిరి మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలు 48 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1 నుండి 5వ తరగతి వరకు 1951మంది విద్యార్థులు, 7 నుంచి 8వ తరగతి వరకు 1200మంది విద్యార్థులు, 9 నుంచి 10 వ తరగతి వరకు 680మంది చొప్పున మొత్తం 3831మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కోటగిరి మండల కేంద్రంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు ప్రత్యేక గదులు లేకపోవడంతో తరగతి గదుల్లోనే వంట చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పాఠశాల వంట గది రేకుల షెడ్డు కూలిపోయింది. పాఠశాల భవనంలోని ఓ తరగతి గదిలో వంట చేస్తున్నారు. ఆ గది సైతం శిథిలావస్థకు చేరింది. కోటగల్లీ, మిర్జాపూర్ ప్రాథమిక పాఠశాలల్లోనూ మధ్యాహ్న భోజనం వంట చేసేందుకు సరైన వసతులు లేకపోవడంతో ఇంటి వద్ద నుంచే మధ్యాహ్న భోజనం తయారు చేసి తీసుకువస్తున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో సుమారు 624మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ వంట గది చిన్నగా ఉండడంతో ఆరు బయటే వంట చేస్తున్నారు.



విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం

గదుల సమస్యను పరిష్కరిస్తాం..

: నాగనాథ్, ఎంఈవో, కోటగిరి

కోటగిరి ఉమ్మడి మండలంలో పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట గదుల సమస్యలు గుర్తించాం. మన ఊరు, మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రతిపాదనలు పంపించాం. అవసరమైన చోట వంట గదులను నిర్మించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

భీమ్‌గల్‌లో చెరువులను పరిశీలించిన కమిషనర్

భీమ్‌గల్, సెప్టెంబరు13: గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసే చెరువును మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. నిమజ్జనం చేసే ప్రదేశంలో అనువుగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గణేష్ నిర్వాహకులు శాంతియుత వాతావరణంలో నిమజ్జనోత్సవం జరుపుకోవాలని చెప్పారు. ఆయనవెంట మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కాకతీయ కాలువలో పడి రేషన్ డీలర్ గల్లంతు

మెండోర, సెప్టెంబరు 13: మండలకేంద్రానికి చెందిన రేషన్‌డీలర్ గాండ్ల అశోక్ (33) ప్రమాదవశాత్తు గురువారం రాత్రి కాలువలో పడి గల్లంతైనట్టు ఎస్సై నారాయణ తెలిపారు. అశోక్ మిత్రుడితో కలిసి పోచంపాడ్ నుంచి మెండోర వచ్చేటప్పుడు కాకతీయ కాలువలో పడి గల్లంతైనట్టు వివరించారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రివరకు కాలువలో గాలించినా అశోక్ ఆచూకీ లభించకపోవడంతో బంధుమిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు. అశోక్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. అశోక్ భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

భీమ్‌గల్‌లో మహిళ ఆత్మహత్య

భీమ్‌గల్, సెప్టెంబరు 13: మతిస్థిమితం లేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణకేంద్రంలోని అయ్యప్పనగర్‌కు కాలనీకి చెందిన పోతుగంటి రాజమణి గత కొన్నిరోజులుగా మతిస్థిమితం లేక ప్రవర్తిస్తోంది. ఇందులో భాగంగానే గురువారం ఉదయం తనఇంట్లోని బాత్‌రూంలోని యాసిడ్‌తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. దీన్ని గమనించిన కుటుంబసభ్యులు నిజామాబాద్ ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతురాలి భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు సుద్దపల్లి విద్యార్థుల ఎంపిక

డిచ్‌పల్లి, సెప్టెంబరు13: సుద్దపల్లి గురుకుల పాఠశాలకు చెందిన సాత్విక, గంగోత్రి, నేహశ్రీ, ప్రీతి, గంగజమున, కావ్యకిసోరి, శరణ్య, మహేశ్వరి, బిందు, ఎస్తార్ రాణి రాష్ట్రస్థాయి జూనియర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నళిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14నుంచి 16వరకు నిర్మల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ పద్మ, వనిత అనూస, పీఈటీ శ్రీలత, కోచ్ మౌనికలు అభినందించారు.

తగిలేపల్లిలో లక్ష్మి గణపతి హోమం

వర్ని,సెప్టెంబర్ 13: మండలంలోని తగిలేపల్లి గ్రామంలో శుక్రవారం లక్ష్మి గణపతి హోమంను వైభవంగా నిర్వహించారు. శివాజీ గణేష్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో సాగాలి

ఏర్గట్ల, సెప్టెంబరు 13: గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో సాగాలని, అందుకు మండపాల నిర్వాహకులు సహకరించాలని భీమ్‌గల్ సీఐ నవీన్, ఎస్సై రాములు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో పలు మండలి నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని వీడీసీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఏర్గట్ల పీఎస్ సిబ్బంది, గ్రామ కమిటీ సభ్యులు, పలు యుజనల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కోటగిరి మండల ప్రత్యేక అధికారిగా అలీం అహ్మద్ బాధ్యతల స్వీకరణ

కోటగిరి,సెప్టెంబరు13: కోటగిరి మండల ప్రత్యేక అధికారిగా అలీం అహ్మద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బోధన్ వ్యవసాయ శాఖ ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న అలీం అహ్మద్‌కు కోటగిరి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో చందర్‌నాయక్ పాల్గొన్నారు.

రుద్రూరు తహసీల్దార్‌గా తారాబాయి బాధ్యతల స్వీకరణ

రుద్రూరు రూరల్, సెప్టెంబరు13: రుద్రూరు నూతన తహసీల్దార్‌గా బర్మావత్ తారాబాయి నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం రుద్రూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆమె పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నజీర్, జూనియర్ అసిస్టెంట్ కొర్వ భూషన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు

ఏర్గట్ల, సెప్టెంబరు13: మండల కేంద్రంలోని కొత్తగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం గ్రామాభివృది కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్‌సౌకర్యాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్‌వో సంధ్య మాట్లాడుతూ పాఠశాలకు విద్యుత్ అసౌకర్యంపై వీడీసీ సభ్యులకు, పలు నాయకుల దృష్టికి తీసుకెళ్లామని, స్పందించిన అధికారులకు, విడీసి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠపన కోసం భూమిపూజ

ముప్కాల్, సెప్టెంబరు13: మండలకేంద్రంలోని మార్కెట్‌యార్డు వద్ద బైపాస్ రోడ్డు వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు శుక్రవారం శివాజీ విగ్రహ కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు.



అరోగ్యశిబిరంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వైద్య, ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

● పోలీసులు ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ప్రభుత్వ విప్

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 13: వైద్య, ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని రాజన్నసిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో సిరిసిల్లా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మెగా ఆరోగ్య వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, సిరిసిల్లా కలెక్టర్ సంజీవ్‌జా, జిల్లా పోలీస్ కమిషనర్ అఖిల మహాజన్, అదనపు పోలీస్ కమీషనర్ శేషాద్రిరెడ్డి, జిల్లావైద్యఆరోగ్యశాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు వైద్యశిబిరాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుదారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుంటూ అందరూ అభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నాయరు. మానాల గ్రామంతోపాటు చుట్టుపక్కలగల గిరిజన గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. సుమారు 4 వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేసినట్ల వైద్య ఆరోగ్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమలో ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిదులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంతర్ పాఠశాల క్రీడల్లో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

ముప్కాల్, సెప్టెంబరు 13: గత మూడు రోజులుగా బాల్కొండ మండల కేంద్రంలో నిర్వహించిన బాల్కొండ ఉమ్మడి మండలాల అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో ముప్కాల్ కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ముప్కాల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులను ఎంఈవో బట్టు రాజేశ్వర్, స్పెషల్ ఆఫీసర్ వినోద, పీఈటీని అభినందించారు. మార్చ్ ఫస్ట్‌లో మొదటిబహుమతి సాధించిన, 100 మీటర్ల పరుగుపందెంలో రెండో బహుమతి, సాంస్కృతిక కార్యక్రమాల్లో బహుమతుల గెలుపొందినట్లు తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి నిధుల మంజూరు

కోటగిరి, సెప్టెంబరు13: మండలకేంద్రంలో వివిధ అభివృద్ధి పనులకు వ్యవసాయశాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి నిధులు మంజూరు చేశారని జిల్లా కాంగ్రెస్ నాయకులు కొట్టం మనోహర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాత బస్టాండ్ నిర్మాణానికి రూ. 15లక్షలు, జిల్లా పరిషత్ పాఠశాలలో అదనపు గదులకు రూ.12 లక్షలు, మిర్జాపూర్ ప్రాథమిక పాఠశాల అదనపు గదులకు రూ.12 లక్షలు, కోటగల్లీ ప్రాథమిక పాఠశాల అదనపు గదులకు రూ.24 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు షాహీద్, అనంత్, మిర్జాపూర్ సాయన్న, అయుబ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఏర్గట్ల, సెప్టెంబరు13: మండలకేంద్రంతో పాటు తాళ్లరాంపూర్ గ్రామంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరీ అయిన చెక్కులను ముగ్గురి లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు, లబ్ధిదారులు చెక్కుల మంజూరీకి కృషిచేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెపు గంగాప్రసాద్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ కొట్టాల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

మహిళలకు అండగా షీటీం

ముప్కాల్, సెప్టెంబరు13: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే షీటీంకు సమాచారం ఇవ్వాలని సబ్‌డివిజన్ షీటీం కానిస్టేబుల్ సుమతి విద్యార్థినిలకు తెలిపారు. శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలోని మైనారిటీ హైస్కూల్, కళాశాలలో సైబర్ క్రైం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్‌తో ఇబ్బందులు పడుతున్న విద్యార్థినిలు, మహిళా ఉద్యోగులు భయపడకుండా 100నెంబర్‌కు, 8712659795 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చందన, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్రైడే, డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు13: ప్రతీ శుక్రవారం ఫ్రైడే, డ్రైడే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రాజాశ్రీనివాస్ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం హసాకొత్తూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ దోమల వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై గ్రామస్థులు అవగాహన కల్పించారు. నిలువఉన్న నీటిలో లార్వాగ తయారై దోమలుగ మారుతాయని వీటివల్ల మలేరియ, డెంగ్యూ, లాంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తించి మరణానికి దారితీస్తాయని వీటిపట్ల ప్రజలు తగుజాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఏఎన్ఎం మమత స్థానిక అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు ఉన్నారు. అంతకుముందు స్థానికఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌ఏర్పాటు కోసం తరగతి గదులను పరిశీలించారు.

చిట్టాపూర్‌లో విద్యార్థి అదృశ్యం

ముప్కాల్, సెప్టెంబరు13: బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన కంచె రాకేష్ అనే విద్యార్థి అదృశ్యమైనట్టు బాల్కొండ ఎస్సై బి.నరేష్ తెలిపారు. చిట్టాపూర్ గ్రామంలో ఈనెల 11 రాత్రి 7గంటల సమయంలో గణపతిని చూసేందుకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదని తల్లి కంచె బాను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుచేయగా కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బి.నరేష్ తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే 8712659756కు చేయాలని ఎస్సై తెలిపారు.

రక్తదానం మరొకరికి ప్రాణాదానం

డిచ్‌పల్లి, సెప్టెంబరు13: యువజన సంఘాల యువకులు అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నట్లే రక్తదానాలు చేయడానికి ముందుకురావాలని రక్తదానం మరొకరికి ప్రాణదానమని రెడ్ క్రాస్‌సొసైటీ జిల్లా చైర్మన్ బూస ఆంజనేయులు అన్నారు. శుక్రవారం యువసేన యూత్ ఆధ్వర్యంలో ఘన్‌పూర్ లో గణేశ్ మండపంలో 20మంది యువకులు ముందుకురావడం అభినందనీయమన్నారు. యువత సమాజసేవ కార్యక్రమాల్లో పాల్గొంటూ రక్తదానం చేయడానికి జిల్లాలోనే మొదటిసారిగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. శిబిరంలో రక్తదాతలు మ్యాన కృష్ణ తేజా, రమణ, సాయినాథ, మహేశ్, ప్రశాంత్ గౌడ్, దిలీప్, విజయ్, రవి, నరేశ్, వీడీసీ సభ్యులున్నారు.

వికసిత భారత్ అఖిల భారతీయ మహిళా సదస్సు విజయవంతం చేయాలి

డిచ్‌పల్లి, సెప్టెంబరు13: అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంగ్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ రిసెర్చ్ ఆధ్వర్యంలో అఖిల భారతీయ మహిళా విశ్వవిద్యాలయ బోధకుల కాన్ఫరెన్స్ ఈనెల 21న ఓయూలో నిర్వహిస్తున్నారని ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొ.సుధాకర్‌రెడ్డి శుక్రవారం బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కాన్ఫరెన్స్ లో వికాసిత్ భారత్‌లో మహిళా అధ్యాపకుల పాత్ర పరిశోధన చర్చించనున్నారు. అభివృద్ధి చెందే భారతదేశానికి మహిళా నాయకత్వం సవాళ్లపై చర్చిస్తారన్నారు. పారిశ్రామిక వేత్తల, విద్యా ప్రాధాన్యతలు సదస్సులో చర్చిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరతి, స్వప్న, స్రవంతి, పద్మ, రమ్య, నీలిమా, కార్యక్రమాన్ని ప్రొఫెసర్ వాసం చంద్రశేఖర్ సమన్వయం చేశారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

నవీపేట, సెప్టెంబరు13: ఓటర్ల జాబితా పరిశీలనకు చేపట్టిన ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆగస్టు 20 నుంచి చేపట్టిన ఇంటింటి సర్వే వచ్చే అక్టోబరు వరకు కొనసాగనుంది. దీనికి సంబంధించి బీఎల్‌వోలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. కుటుంబంలో ఉన్న ఓటర్ల పేర్ల పరిశీలన, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, 18 ఏళ్లు నిండిన వారికి నూతనంగా ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు వంటి వివరాలను బీఎల్‌వోలు తమ యాప్‌లో నమోదు చేయవాల్సి ఉంటుంది.



బీఎల్‌వోలను ఉద్దేశించి మాట్లాడుతున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

ఇంటింటి సర్వేలో నవీపేట మండలం పూర్తిగా వెనుకబడి ఉండడం పట్ల అసంతృప్తి వ్యక్తంచేశారు. తమకు బీఎల్‌వో విధులు అదనపు భారంగా ఉందని, తమకు బీఎల్‌వో విధుల నుంచి తప్పించాలని పలువురు పంచాయతీ కార్యదర్శులు, పలువురు అంగన్‌వాడీ టీచర్‌లు సబ్ కలెక్టర్ దృష్టికి తేగా ప్రతీఒక్కరు తమ బీఎల్‌వో విధులు కచ్చితంగా నిర్వహించవాల్సిందేనని సబ్‌కలెక్టర్ స్పష్టంచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీవో రామకృష్ణ, నాయబ్ తహసీల్దార్ తేలంగ్‌రావు, ఆర్ఐ నరేష్, మండల రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ దేవిసింగ్ ఉన్నారు.

గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

డిచ్‌పల్లి, సెప్టెంబరు 13: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని సీడీపీవో స్వర్ణలత అన్నారు. చిన్నారులు, గర్భిణీలకు తీసుకోవాల్సిన పోషకాహారంపై శుక్రవారం అవగాహన కల్పించారు. గర్భిణీలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో దేవ సాల, ఏఎన్ఎంలు మహలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు జ్యోతి, ఆశాకార్యకర్తల కరుణ పాల్గొన్నారు. మండలంలోని మెంట్రాజ్‌పల్లి రాంపూర్‌గ్రామాల్లో పోషణ్ అభియన్ కార్యక్రమాల్లో ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ పలు ఆరోగ్య సూచనలు ఇచ్చారు. పాల్గొన్నారు కార్యక్రమంలో బుజ్జి, మమత, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

బోధన్‌రూరల్: గర్భిణీ, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ గోపిలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మహిళలు ఆరోగ్య సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. పౌష్టికాహారంతోనే మహిళలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ టీచర్‌లు సుశీల, జయలక్ష్మి, ఆశ వర్కర్‌లు స్వరూప, శోభ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు బహుమతులు అందజేస్తున్న సీడీపీవో

జ్వరంతో యువతి మృతి



శిరీష (ఫైల్)

రెంజల్, సెప్టెంబరు 13: మండలంలోని నీలా గ్రామానికి చెందిన క్యాతం శిరీష (24) జ్వరంతో బాధపడుతూ మృతిచెందింది. గత కొద్దిరోజులుగా విషజ్వరంతో శిరీష మంచాన పడింది. స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కోటగిరి, సెప్టెంబరు 13: పోతంగల్ మంజీరనది నుంచి ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా టిప్పర్‌ను పట్టుకున్నట్లు చెప్పారు.

శివాలయంలో హుండీ లెక్కింపు

బోధన్‌రూరల్, సెప్టెంబరు 13: మండలంలోని ఏకచక్రేశ్వరాలయంలో శుక్రవారం హుండీలెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హుండీ లెక్కింపులో రూ.86,653 వచ్చినట్లు లభించినట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల తెలిపారు. కార్యక్రమంలో హరికాంత్ చారి, దేవాదాయ శాఖ ఈవో రవీందర్ గుప్తా, జూనియర్ అసిస్టెంట్ రాములు, అర్చకులు గణేష్ శర్మ, మహేష్ పాఠక్, భూమేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

బోధన్‌రూరల్, సెప్టెంబరు13: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని సాలూర నూతన తహసీల్దార్ శశిభూషణ్ అన్నారు. శుక్రవారం సాలూర తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ప్రతీఒక్కరు పాటించాలన్నారు. బోధన్ తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన శశిభూషణ్ సాలూర తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. నిత్యం అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారిస్తామన్నారు.

మల్లారం ఆశ్రమ పీఠాధిపతి ప్రత్యేక పూజలు

మోస్రా, సెప్టెంబరు13: మండల కేంద్రంలోని బాపనయ్య నగర్ కాలనీలో గల పవన్ యూత్ శక్తి గణేష్ మండలి వద్ద మల్లారం ఆశ్రమ పీఠాధిపతి పిట్ల కృష్ణ మహరాజ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుని విశిష్ఠతను గోమాత ప్రత్యేకతను వివరించారు. యువతీ, యువకులు చెడుమార్గాలను వీడి భక్తితో సన్మార్గంలో నడవాలని సూచించారు. మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించిన యూత్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో పవన్ యూత్ సభ్యులు, గ్రామస్థులున్నారు.

'బీడీ కార్మికులకు రూ.4016 ఇవ్వాలి'

ఏర్గట్ల, సెప్టెంబరు13: కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీడీ కార్మికులకు రూ.4016 ఎలాంటి ఆంక్షలు లేకుండా భృతిని ఇవ్వాలని తెలంగాణ ప్రగతీశీలా బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెక్క, సారా సురేష్, రాజేశ్వర్, కార్మికులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న మహిళలు

ప్రశాంతంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర

రెంజల్, సెప్టెంబరు13: మండలంలోని నీలాలో 7వ రోజు గణేష్ నిమజ్జన శోభాయాత్ర శాంతియుత వాతావరణంలో ముగిసింది. శుక్రవారం గణేష్ నిమజ్జనం భారీ బందోబస్తు నడుమ సాగింది. శోభాయాత్రను బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గణేష్ శోభాయాత్రను ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్సైలు, ప్రత్యేక పోలీసు బలగాలు, స్పెషల్ పార్టీ ఎస్‌బీ నిఘాతో ప్రత్యేక ఏర్పాట్లలో ఎటువంటి అవాంతరాలు లేకుండా శాంతియుత వాతావరణంలో నీలాలో గణేష్ నిమజ్జనం సాగింది. గణేష్‌ల వద్ద భక్తిపాటలతో కోలాటాలు, దండియాలతో యువతీ, యువకులు నృత్యాలుచేశారు. శోభాయాత్రను తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ఏర్పాట్లు పరిశీలించారు. రెంజల్ ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పర్యవేక్షించారు.

విఘ్నేశ్వరుడి ఆశీస్సు అందరిపై ఉండాలి

● బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి

బోధన్‌రూరల్,సెప్టెంబరు13: విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతాలల్లోని వినాయక మండపాల్లో 7వ రోజు వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్య దామోదర్‌లతో మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి మూడు నెలల జైలు

బోధన్ రూరల్, సెప్టెంబరు13: ఫోన్ దొంగలించడమే కాకుండా మహిళను భయభ్రాంతులకు గురిచేసిన వ్యక్తికి బోధన్ కోర్టులో న్యాయాధికారి 3 నెలల జైలుశిక్ష విధించారు. దొంగతనం నిరూపణ కావడంతో మూడునెలల జైలుశిక్ష విధించారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాణి, ఎస్ఐ అనిల్ రెడ్డి, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

బోధన్‌రూరల్, సెప్టెంబరు13: లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్, బోధన్ అయ్యప్ప సేవా ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్ మండలంలోని సాలంపాడ్ క్యాంప్ గ్రామంలోని కోదండ రామాలయం కల్యాణ మండపంలో ఉచిత కంటి పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజలకు ఉచితంగా మందులు అందజేశారు. ప్రజలకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ సెక్రెటరీ పోశెట్టి, రీజినల్ సెక్రెటరీ సూరబత్తుల శ్రీనివాస్ రావు, లయన్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు

బోధన్‌రూరల్, సెప్టెంబరు13: సీపీఐ(ఎం) పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పేదవర్గాలకు తీరని లోటని ఆ పార్టీ నాయకులు గంగాధరప్ప, కుమార స్వామి అన్నారు. శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచి కమ్యూనిస్టు పార్టీ వైపు అడుగు చేసి కార్మికులు, అణగారిన వారి హక్కుల కోసం సుదీర్ఘ పోరాటంచేసిన ఏచూరి మరణం తీరని లోటన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్, పోశెట్టి, గోపి, నసీర్, హన్మంత్ రావు, షేక్.బాబా ఫైమద్, తదితరులు పాల్గొన్నారు.

● బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటు

సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం బడుగు, బలహీన వర్గాలకు తీరనిలోటని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీ హన్మంత్ రావు అన్నారు. దేశ రాజకీయలతో పాటు బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పోరాడిన యోధుడని కొనియాడారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

కోటగిరి: సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం తీరని లోటని సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడిత, తడిత, అణగారిన వర్గాలవైపు నిలబడి వారి సమస్యలపై ఏలుగెత్తిన వామపక్ష యోధుడు కామ్రేడ్ ఏచూరి మరణం వామపక్షాలకు తీరని లోటని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో అడుగు పెట్టిన సీతారాం ఏచూరి జాతీయ రాజకీయాలలో క్రియాశీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగాధర్, హన్మాండ్లు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విప్లవ ఉద్యమానికి తీరని లోటు

వర్ని: సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి విప్లవ ఉద్యమానికి తీరని లోటు అని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. శుక్రవారం వర్ని మండల కేంద్రంలోని సుభాష్ చౌరస్తాలో సీతారాం ఏచూరి పూలమాలల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మేకల మల్లేష్, గంగాదర్, సాయిబాబా, సాయిలు, మారయ్య, సాయి, లింగం, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌కు విద్యార్థుల ఎంపిక

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు13: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఆలూర్ మండల కేంద్రంలోని జిల్లా ప రిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.సాత్విక్, కల్లడ జిల్లాపరిషత్ ఉన్నపాఠశాలకు చెందిన బండారి హరికుమార్ ఎంపికైనట్టు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, రామోజీ నాగరాజు తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను పీడీ సురేందర్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 14న నుంచి వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

ఏర్గట్ల డిప్యూటీ తహసీల్దార్‌గా విష్ణువర్ధన్ బాధ్యతలు

ఏర్గట్ల, సెప్టెంబరు13: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్‌గా విష్ణువర్ధన్ బాధ్యతలు చేపట్టారు. బదిలీలో భాగంగా బోధన్ నుంచి ఏర్గట్లకు బాధ్యతలు చేపట్టిన విష్ణువర్ధన్‌కు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు. బదిలీపై వెళుతున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌ను సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐ సదానంద్, కిరణ్, రాకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటగిరి ఎంపీడీవోగా శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి,సెప్టెంబర్ 13: కోటగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీవో చందర్ నాయక్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డికి పూర్తిస్థాయి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీవోను మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజాసమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో చందర్ నాయక్, ఏపీవో గంగారాం, పంచాయతీ కార్యదర్శి ముజాఫర్ బేగ్ పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రత్యేక అధికారిణిగా కవిత బాధ్యతల స్వీకరణ

నవీపేట, సెప్టెంబరు 13: మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాల ప్రత్యేక అధికారిణిగా కవిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పాఠశాల ప్రత్యేకాధికారిణిగా పనిచేసిన రాణి నిజామాబాద్ సౌత్ కేజీబీవీకి బదిలీ కాగా, భద్రాద్రి కొత్తగూడెం కేజీబీవీ ప్రత్యేక అధికారిణిగా పనిచేసిన కవిత బదిలీపై మోకన్‌పల్లి కేజీబీవీ ప్రత్యేక అధికారిణిగా నియమీతులయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

నవీపేట తహసీల్దార్‌గా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ

నవీపేట, సెప్టెంబరు13: నవీపేట తహసీల్దార్‌గా వెంకట రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నవీపేట తహసీల్దార్‌గా పనిచేసిన నారాయణ గత నెలాఖరున ఉద్యోగ విరమణ చేయడంతో డొంకేశ్వర్ తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటరమణ నవీపేట తహసీల్దార్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు తహసీల్దార్ వెంకట రమణను సన్మానించారు.

ఎంపీడీవో కార్యాలయ బోర్డుపై ఓటరు జాబితా

బోధన్‌రూరల్,సెప్టెంబరు 13: బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో బోర్డుపై ఓటరు జాబితా లిస్టును ఏర్పాటుచేసినట్లు బోధన్ ఎంపీడీవో బాలగంగాధర్ అన్నారు. శుక్రవారం బోధన్ మండల పరిషత్ బోర్డుపై ఓటరు జాబితా లిస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కామారెడ్డిలో బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు13: కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. శుక్రవారం ఉదయం ఎల్లారెడ్డిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్‌కుమార్‌తోపాటు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మద్నూర్‌లో..

మద్నూర్: మద్నూర్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన బీఆర్ఎస్ నాయకులను మద్నూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టుచేశారు. మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు పిలుపుమేరకు హైదరాబాద్ తరలివెళ్తున్న నాయకులను తెల్లవారు జామునే ముందస్తుగా మద్నూర్‌లో అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు బన్సీపటేల్, మాజీ సర్పంచ్‌లు ధరస్ సురేష్, షేక్‌గఫార్, అబ్దుల్ కరీం, నాయకులు గోవింద్, సుల్తాన్, కంచన్ రవి, అవార్ రాజు తదితరులు ఉన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్: హైదరాబాద్‌కు బీఆర్ఎస్ నాయకులు తరలిరావాలంటూ బీఆర్ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో జుక్కల్ నియోజకవర్గంలోని పెద్దకొడప్‌గల్, జుక్కల్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్‌చేశారు. ఈ సందర్భంగా పెద్దకొడప్‌గల్ ఎస్సై మహేందర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశామని తెలిపారు.

దాడి సిగ్గుచేటు..

కామారెడ్డిటౌన్: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆయన అనుచరులు దాడిచేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నిట్టువేణుగోపాల్‌రావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే హరీష్‌రావు పిలుపుమేరకు హైదరాబాద్‌కు బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్‌చేసి పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయినవారిలో బీఆర్ఎస్ నాయకులు ముప్పారపు ఆనంద్, గెరిగంటి లక్ష్మీనారాయణ, నజీర్, నిట్టు వెంకట్‌రావు, పిట్ల వేణు, సంగిమోహన్, ముదాంనవీన్ తదితరులు ఉన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు సంబంధించిన బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. అరెస్ట్‌అయిన వారిలో మండల పార్టీ నాయకులు నల్లవెల్లి అశోక్, బలవంతరావు, మోహన్‌రెడ్డి, శంకర్, కృష్ణమూర్తి, అంద్యాల రమేష్, మల్లగారి బాలయ్య, శ్రీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరు

తాడ్వాయి: అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. హైదరాబాద్‌కు బయలుదేరుతున్న నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మండల నాయకులు పులగం సాయిరెడ్డి, సోసైటి చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముదాంనర్సింలు, రమేష్‌రావు, మంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి,రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసుస్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

బిచ్కుందలో..

బిచ్కుంద: ప్రజలకు ఇచ్చినహామీలను నేరవేర్చాలని ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడం సిగ్గుచేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రావుదేశాయ్ అన్నారు. శుక్రవారం పాడికౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా ఎమ్మెల్యే హరీష్‌రావు పిలుపు మేరకు హైదరాబాద్‌కు వెళ్తున్న తమను అక్రమంగా అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించడం తగదని అన్నారు. అరెస్ట్‌అయిన వారిలో మాజీ ఎంపీపీ అశోక్‌పటేల్, నాల్చార్‌రాజు,ప్రధానకార్యదర్శి రాంచందర్, సోసైటి చైర్మన్ బాలు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో..

దోమకొండ: మండంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్‌చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదివికి అనర్హుడని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుంచాల శేఖర్, గజవాడ శ్రీకాంత్ కడారి రమేష్, రాజిరెడ్డి, శ్రీనివాస్, శేఖర్, కిషన్‌రెడ్డి, నాగరాజు ఉన్నారు.

పాఠశాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్


పాఠశాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 13: దుబ్బ ప్రభుత్వ పాఠశాలను నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ పరిశీలించారు. శుక్రవారం నగరంలోని దుబ్బ ప్రాంతంలోగల జడ్పీహెచ్ఎస్ పాఠశాలను కమిషనర్ పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలల్లో తిరుగుతూ ఉపాధ్యాయులను పాఠశాలల్లో గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

'ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి'

సుభాష్‌నగర్, సెప్టెంబరు 13: విద్యుత్ శాఖలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు వ్యతిరేకంగా జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రాష్ట్ర అసోసియేషన్ ప్రసిడెంట్ నాంపల్లి, ప్రధాన కార్యదర్శి గంగారాం నాయక్‌లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ ప్రగతిభవన్‌లో మధ్యాహ్న భోజనం సమయంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఇంజనీర్స్ బాబా శ్రీనివాస్, గోపి, సాయిలు, నాయకులు శంకర్, నాగరాజు, జీవన్, శ్రీనివాస్, పోశెట్టి, మహిళా నాయకురాలు ప్రజ్ఞలత, రాధా, రాధిక, పాల్గొన్నారు.

పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఇందల్వాయి, సెప్టెంబరు 13: పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అందుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శోభ అన్నారు. శుక్రవారం ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడి సూపర్‌వైజర్ శోభ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వరద సాయంగా నిధులు విడుదల చేయాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 13: కేంద్ర ప్రభుత్వం తక్షణమే వరద బాధితుల సహాయార్థం తెలంగాణకు 2వేల కోట్లు విడుదల చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన కలెక్టరేట్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓమయ్య, రాజన్న, అంజలి, సాయిలు, ఆలి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

పెద్దబజార్, సెప్టెంబరు 13: కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయాలని ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పోచమ్మగల్లీలోని ముదిరాజ్ కళ్యాణ మండపంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమన్న అధ్యక్షతన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఎఫ్‌టీయు జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమేశ్వర్, దాసు, సూర్య శివాజీ, శివకుమార్, వెంకట్, నారాయణ, ఆకుల రాములు, అబ్దుల్, భారతి, పోశెట్టి, పద్మా, మోహన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలి

● డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు

ఖిల్లా, సెప్టెంబరు 13: బహుజన వర్గానికి చెందిన న్యాయవాదిని కులంపేరుతో దూషించి దాడి చేసిన మరో న్యాయవాదిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఈనెల 11న కోర్టు ఆవరణలో ఉన్న న్యాయవాది (బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి)వసంత్‌రావ్ ఓ కేసు విషయంలో కక్షిదారునికి సమస్య పరిష్కారం గురించి వివరిస్తుండగా నవాతేజగన్ అనే మరో న్యాయవాది వచ్చి వసంత్‌రావ్‌పై దాడి చేశాడన్నారు. పైగా కులంపేరుతో దూషిస్తూ దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడని వారు పేర్కొన్నారు. ఒకే వృత్తిలో కొనసాగుతున్న న్యాయవాది మరో న్యాయవాదిపై దాడి చేయడం హేయమైన చర్యగా భావించి సదరు న్యాయవాదిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. కోటేశ్వర్, ఉపాధ్యక్షుడు కే.సంజీవ్‌రావ్, ప్రధానకార్యదర్శి జి.రాములు, గుట్పే లింగన్న, భూమయ్య, వసంత్‌రావ్‌లు పాల్గొన్నారు.

కుంకుమార్చనలు, తాంబూలాలు

● ఏడో రోజు గణనాథునికి ఘనమైన పూజలు



నగరంలో పూజలు చేస్తున్న మహిళలు


వినాయక మండపం వద్ద కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 13: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కుంకుమార్చనలు ఘనంగా సాగాయి. మండపాలు, ఆలయాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమార్చనలో పాల్గొని భక్తిని చాటుకున్నారు. అమ్మవారి రోజు కావడంతో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక కుంకుమార్చనలో భాగస్వాములై తోటి మహిళలకు తాంబూలాలు సమర్పించుకున్నారు. పలు మండపాల వద్ద పూజలతో పాటు మహా అన్నప్రసాద కార్యక్రమాలను కూడా నిర్వహించారు. నగరంలోని సాయినగర్‌లోగల స్వయంభుమిత్ర గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు పాల్గొని కుంకుమార్చనలు జరిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు విమల్ చౌదరి, కిశోర్, రవీందర్‌చారి, సాయిలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వినాయక్‌నగర్‌లో నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు పాల్గొని మంగళహారతులతో గణనాథున్ని పూజించారు. పోచమ్మగల్లిలోగల మహేశ్వర గణేష్ మండపంలో అన్నదాన కార్యక్రమంలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆకట్టుకుంటున్న కాణిపాక గణనాథుని విగ్రహం

ఖిల్లా రోడ్‌లోగల విజయ్ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో కొలువు దీరిన కాణిపాక గణనాథుని విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. కాణిపాక ఆలయంలో గణపతి ఏ విధంగా ఉంటుందో అదే విధంగా ఉండేలా గణనాథున్ని ఏర్పాటు చేశారు. మండపం చుట్టూ కాణిపాక ఆలయ నమూనాతో ఉండటంతో భక్తులు కాణిపాక వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్న అనుభూతిని పొందుతున్నారు.

హైందవసేనా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో..

నగరంలోని వినాయక్‌నగర్‌లోగల పంచముఖి హనుమాన్ మందిర్ ఆలయం వద్ద కొలువుదీరిన హైందవసేనా ఆధ్వర్యంలో కొలువుదీరిన మట్టి గణపతి ఘనంగా పూజలు కొనసాగుతున్నాయి. అందమైన ఆకృతిలో ఛత్తీస్‌గఢ్, రాయ్‌పూర్ కళాకారులతో తయారు చేయించిన విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షింపజేస్తోంది.

తెలంగాణలో చిచ్చు పెట్టే విధంగా కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి, పక్కన గడుగు

నిజామాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో చిచ్చు పెట్టే విధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉన్నాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ఎక్కడా శాంతిభద్రతలకు భంగం కలుగకుండా చర్యలు చేపట్టారన్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఇబ్బందులు లేకుండా చూస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు అప్పటి సీఎం కేసీఆర్ సెక్యూలర్స్‌కు అనుకూలంగా మాట్లాడారని అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మరో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ విషయంలో సెక్యూలర్ అని మాట్లాడితే ఎందుకు మాజీ సీఎం కేసీఆర్ ఖండించడం లేదని ఆయన ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి మాట్లాడటం వెనుక ఉద్దేశం ఏమిటో చెప్పాలన్నారు. కేసీఆర్ మాట నమ్మి ఇక్కడ సెటిల్ అయిన వారంతా బిఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించారని అన్నారు. ప్రస్తుతం కౌశిక్‌రెడ్డిని ముందుకు తోస్తూ రాష్ట్రంలో అల్లర్లకు ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. మాజీ మంత్రులు హరీ‌ష్‌రావు, కేటీఆర్‌లు ఎంత ప్రయత్నించినా వారికి ఛాన్స్ రాదని ఆయన అన్నారు. పోలీసులపైన హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని ఆయన అన్నారు. జిల్లా ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి కూడా కౌశిక్‌రెడ్డికి వంత పాడుతున్నారని ఆయన విమర్శించారు. ఈనెల 15న పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలను చేపడుతారని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ పాల్గొన్నారు.


ఎస్ఆర్ కాలేజీలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్ఆర్ కాలేజీలో గణనాథునికి పూజలు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 13: నగరంలోని పాంగ్రాలోగల ఎస్ఆర్ ప్రైమ్ రోజి ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం గణనాథునికి 111 రకాలతో మహాభోగ్ నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా జోనల్ క్యాంపస్ ఇన్‌చార్జి ప్రణీత్ మాట్లాడుతూ.. విద్యతో పాటు ఆధ్యాత్మిక విలువలతో కూడిన విషయాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలని వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇస్సాక్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుతంగా నిమజ్జనం జరుపుకోవాలి

మోపాల్, సెప్టెంబరు 13: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం జరిగే గణేష్ నిమజ్జనాన్ని ప్రజలందరూ శాంతియుతంగా జరుపుకోవాలని మోపాల్ ఎస్సై యాదగిరిగౌడ్ మండపాల ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో మండలంలోని ఆయా గ్రామాల మండపాల ప్రతినిధులతో శాంతి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీడీవో రాములు, తహసీల్దార్ రామేశ్వర్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు

ధర్పల్లి, సెప్టెంబరు 13: మండలంలో భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం వివిధ మండపాల్లో నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. తాజా మాజీ ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిమూర్తి గణేష్ మండలి వద్ద కుంకుమార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా మండపాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.




కలెక్టర్‌కు ప్రసాదాన్ని అందజేస్తున్న దృశ్యం

వినాయకుడికి కలెక్టర్ పూజలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 13: కలెక్టరేట్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ల సీజ్

ఇందల్వాయి, సెప్టెంబరు 13: ఇందల్వాయి అటవీ రేంజ్ పరిధిలోని ధర్పల్లి సెక్షన్ దుబ్బాక బీట్‌లో అటవీ భూమిని అక్రమంగా చదును చేస్తున్న రెండు ట్రాక్టర్లు, చంద్రయాన్‌పల్లి అటవీ ప్రాంతంలో మరో ట్రాక్టర్‌ను అటవీ శాఖ అధికారులు పట్టుకొని సీజ్ చేసినట్లు ఇందల్వాయి ఎఫ్ఆర్‌వో రవిమోహన్ భట్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం తెల్లవారుజామున అటవీ ప్రాంతంలో చెట్లు నరికివేసి భూమిని చదును చేస్తున్నారనే తెలియడంతో అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి ట్రాక్టర్లను పట్టుకున్నామని తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను ఇందల్వాయి రేంజ్ కార్యాలయానికి తరలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోతో పాటు డిప్యూటీ ఎఫ్ఆర్‌వో తుకారాం రాథోడ్, బీట్ అధికారులు శ్రీకాంత్, ఖదీర్, రంజిత్, సందీప్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది ఉన్నారు.

పొల్యూషన్‌తో ఓజోన్ పొరకు ముప్పు

ధర్పల్లి, సెప్టెంబరు 13: పొల్యూషన్ వల్ల ఓజోన్ పొరకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ధర్పల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి అన్నారు. శుక్రవారం డిగ్రీ కళాశాలలో ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఓజోన్ దినోత్సవ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. వాతావరణంలోని ఓజోన్ పొర క్షీణత గురించి వివరిస్తూ వాతావరణంలోని ఓజోన్ పొర రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశ నుంచే ఓజోన్ పొరపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి శారద, అధ్యాపకులు ప్రభాకర్, రవిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్, రాంచందర్, సంజీవ్, సరిత, నిహారిక, సరళ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు కంజర క్రీడాకారులు

మోపాల్, సెప్టెంబరు 13: రాష్ట్రస్థాయి జూనియర్ బేస్‌బాల్ పోటీలకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కంజర క్రీడాకారులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయలలిత తెలిపారు. ఈనెల 8న సుద్దపల్లిలో జరిగిన బాలికల జిల్లా జూనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపికలో ప్రతిభకనబర్చారు. ఈనెల 14 నుంచి 16 వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలో వీరు పాల్గొననున్నారు. పోటీలకు ఎంపికైన స్నేహిత, చంద్రహాసిని, స్పందనలు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ వారిని అభినందించారు.

సీతారాం ఏచూరికి నివాళులు

పెద్దబజార్, సెప్టెంబరు 13: జిల్లా వ్యాప్తంగా సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని సిపిఎం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను అవనతం చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో కమ్యూనిస్టుల ఐక్యత కొరకు పార్టీ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కోసం విశేష కృషి చేశారని అన్నారు. విద్యార్థి నాయకుడిగా ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించి పార్టీ అఖిల భారత కార్యదర్శిగా సేవలు అందించారని అన్నారు. జిల్లాతో సీతారాం ఏచూరికి అనుబంధం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, రామ్మోహన్, విఘ్నేష్, రాములు, నర్సయ్య, సిర్పలింగం, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

మోపాల్, సెప్టెంబరు 13: విద్యార్థులు కష్టపడి చదువుకున్నప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని కంజర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాలచారి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం శ్రీరామ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు 90 జామెంట్రీ బాక్సులు, 200 నోట్‌బుక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సంస్థ చేస్తున్న సేవలను గుర్తించి ప్రశంసించారు. గత 20 సంవత్సరాల నుంచి ఈ సంస్థ నిస్వార్థంగా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి రామ్మోహన్, కార్యవర్గ సభ్యులు శేఖర్, శ్రీనివాస్, రాజశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, వెంకటలక్ష్మి, అరుణశ్రీ, రాణి, క్రాంతికిరణ్, భూమయ్య, విజయలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

రూరల్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

మోపాల్, సెప్టెంబరు 13:నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్, లక్ష్మాపూర్, జలాల్‌పూర్ గ్రామాలలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, మండల సభ్యత్వ ఇంచార్జి రవీందర్‌రెడ్డి, శక్తి కేంద్రం ఇంచార్జి శంకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బాలరాజు, సుధాకర్, అదిష్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు.

పోకిరీలకు రెండు రోజుల జైలు

ధర్పల్లి, సెప్టెంబరు 13: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముగ్గురు పోకిరీలకు నిజామాబాద్ సెకండ్ క్లాస్ జడ్జి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సీతాయిపేట గ్రామానికి చెందిన చెప్యాల బాబు, సుంచరాజు, ధనంబండ తాండాకు చెందిన గుగులోత్ అనీల్ అనే ముగ్గురు డయల్ 100కు డయల్ చేస్తూ దుర్వినియోగం చేయగా ఆ వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం ముగ్గురిని కోర్టు ముందు హాజరుపర్చగా మెజిస్ట్రేట్ డయల్ 100 సేవలను దుర్వినియోగం పర్చిన ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు. ఇలాంటి పోకిరీలను ఉపేక్షించేది లేదని 100 డయల్‌ను దుర్వినియోగపర్చిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రమాదంలో ఉన్న వారి కోసం ఏర్పాటు చేసిన 100 డయల్ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

44 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖిల్లా, సెప్టెంబరు 13: నగరంలోని ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్సపల్లి-నిజాంకాలనీ మధ్య వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న బొలేరో ట్రాలీని తనిఖీ చేయగా అందులో అక్రమంగా రవాణా అవుతున్న సుమారు 44 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించామని ఎస్సై వెంకట్రావ్ తెలిపారు. బియ్యం మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుసుకొని వాహనాన్ని సీజ్ చేసి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దొంగతనం కేసులో ఒకరికి జైలు

నిజామాబాద్‌లీగల్, సెప్టెంబరు 13: దొంగతనం కేసులో ఒకరికి 10నెలల జైలు శిక్ష విధిస్తూ రెండవ అదనపు మొదటి తరగతి మెజిస్ట్రేట్ పముజుల శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నడిపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన గణేష్ రూరల్ పోలీసు స్టేషన్ గంగాస్థాన్‌లో 10మార్చి2022న ఒకరి ఇంట్లో చొరబడి ఆరు తులాల బంగారు వస్తువులు, నగదు దొంగలించాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కోర్టులో దాఖలు చేశారు. దొంగతనం చేసిన రుద్రబోయిన గణేష్‌ను బైపాస్ చౌరస్తా వద్ద అప్పటి ఎస్ఐ లింబాద్రి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును పీపీ.బూసారపు రాజేశ్‌గౌడ్ వాదనలో సాక్ష్యాధారలను రుజువు పర్చడంతో జడ్జి పై విధంగా తీర్పు చెప్పారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి..

ఖిల్లా, సెప్టెంబరు 13: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిని 6వ టౌన్ పోలీసులు అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరుపర్చగా కోర్టు ఆ వ్యక్తికి ఒకరోజు సామాజిక సేవా చేయాలని తీర్పు ఇచ్చినట్లు ఆరవ టౌన్ ఎస్సై కె.వెంకట్రావు తెలిపారు. పొన్నల్ గ్రామం షమీర్‌పేట్ మండలానికి చెందిన బత్తిని నవీన్‌కుమార్ మద్యం తాగి వాహనం నడుపుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనను శుక్రవారం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అజ్మీర సాకేత్‌కుమార్ (ట్రైనీ కలెక్టర్) ముందు హాజరుపర్చారు. నూతన క్రిమినల్ చట్టాలను అనుసరించి సదరు వ్యక్తికి ఒకరోజు సామాజిక సేవా చేయాలని తీర్పునిచ్చారు.

మద్యం తాగి వాహనం నడిపిన ఆరుగురికి జరిమానా...

మద్యం తాగి వాహనం నడిపిన ఆరుగురు వ్యక్తులను శుక్రవారం మెజిస్ట్రేట్ అజ్మీర సాకేత్‌కుమార్ (ట్రైనీ కలెక్టర్) ఎదుట హాజరుపర్చగా 11వేల రూపాయల జరిమానాతో పాటు ఒకరోజు సామాజిక సేవా చేయాలని ఆదేశించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరయ్య తెలిపారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74,800	రూ.69,050	రూ.895

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : ప్రేమికుడు (10.00)
: మత్తు వదలరా (1.30, 7.45, 10.45)
: స్త్రీ-2 (4.30)
స్క్రీన్-2 : ఏఆర్ఎం (తెలుగు 3డి) (12.15, 7.00)
: సరిపోదా శనివారం (3.25, 10.10)
స్క్రీన్-3 : భలే ఉన్నాడే (10.25, 7.30)
: 35-చిన్నకథ కాదు (1.25, 10.30)
: మత్తు వదలరా (4.30)
స్క్రీన్-4 : ఉత్సవం (11.00, 7.15)
: తుంబ్బడ్ (హిందీ) (2.00)
: కలింగ (4.40)
: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (తెలుగు) (10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: 3 (తెలుగు) (10.20)
: సరిపోదా శనివారం (1.15, 7.15)
: ఉత్సవం (4.20)
: 35-చిన్నకథ కాదు (10.30)
స్క్రీన్-2: భలే ఉన్నాడే (10.30, 7.25)
: మత్తు వదలరా (1.30)
: ఏఆర్ఎం (తెలుగు 3డి) (4.20, 10.20)
స్క్రీన్-3 : 35-చిన్నకథ కాదు (10.50, 1.50, 7.30)
: మత్తు వదలరా (10.30)

దేవి : మత్తు వదలరా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఉరుకు పటేలా (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఏఆర్ఎం (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్